క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే సమీక్ష సమావేశం

తాళ్లపూడి: తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయంలో 16వ తేదీ ఉదయం పది గంటలకు గోపాలపురం ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకటరావు ఆధ్వర్యంలో మండల అధికారులతో సమీక్ష సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అధ్యక్షత వహిస్తారని చెప్పారు. వివిధ శాఖల మండల అధికారులు హాజరు కావాలన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



త్యాజంపూడిలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న అక్బర్‌ఖాన్

దేవరపల్లి: త్యాజంపూడి జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత పఠాన్ అక్బర్ ఖాన్ బుధవారం సాయంత్రం పరీక్ష సామగ్రిని అందజేశారు. పాఠశాలలోని 25 మంది విద్యార్థులకు పరీక్షలు రాయడానికి అవసరమైన సామగ్రిని అందించారు. ఏటా పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష సామగ్రి అందజేస్తున్నట్టు అక్బర్‌ఖాన్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం వి.విరాట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హౌసింగ్ డీఈఈ కార్యాలయం తరలింపు

దేవరపల్లి: నల్లజర్లలో ఇప్పటి వరకూ ఉన్న గృహ నిర్మాణ శాఖ డీఈఈ కార్యాలయాన్ని నియోజకవర్గ కేంద్రమైన గోపాలపురానికి తరలించారు. బుధవారం ఈ కార్యాలయాన్ని గోపాలపురం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న భవనంలో ఏర్పాటు చేసినట్టు డీఈఈ టి.శేఖర్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి గృహ నిర్మాణాలకు సంబంధించిన కార్యకలాపాలు ఇక్కడ నుంచే నిర్వహిస్తామని చెప్పారు. ఈ మర్పును నియోజకవర్గ ప్రజలు, అధికారులు గమనించాలని కోరారు.

జాతీయ అథ్లెటిక్స్‌కు తాడిమళ్ల విద్యార్థులు



చంద్రశేఖర్, రామచరణ్

నిడదవోలు రూరల్: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎల్.రామచరణ్ (షాట్‌పుట్), బి.చంద్రశేఖర్ (600 మీటర్ల పరుగుపందెం)కు ఎంపికైనట్టు హెచ్ఎం సూర్యనారాయణశాస్త్రి గురువారం తెలిపారు. రాజమహేంద్రవరంలో జరిగిన అంతర్ జిల్లాల జాతీయస్థాయి ఛాంపియన్‌షిప్ ఎంపిక పోటీల్లో వీరు ప్రతిభ కనబరిచారన్నారు. ఈ నెల 16 నుంచి 18 వరకూ గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, సర్పంచ్ బయ్యే రాధారాణి, పీడీ బీఎస్‌వీ ప్రదీప్ వీరిని అభినందించారు.

21న ఐదు పాలవెల్లువ కేంద్రాల ప్రారంభం

చాగల్లు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న జగనన్న పాల వెల్లువ కేంద్రాలతో పాడి రైతులకు, గ్రామస్తులకు ఎంతో మేలు చేకూరుతుందని ఎంపీడీఓ ఎస్ బుజ్జి అన్నారు. ఎస్.ముప్పవరంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చాగల్లు మండలంలో చిక్కాల, కలవలపల్లి, ఎస్.ముప్పవరం, చంద్రవరం, నెలటూరు సచివాలయాల్లో జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ఈ నెల 21న ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. సర్పంచ్ ముప్పిడి మహాలక్ష్మి, సచివాలయ, వెటర్నరి సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలి



అన్నదేవరపేట జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఈ

తాళ్లపూడి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ డీఈ శ్రీనివాస్ చెప్పారు. అన్నదేవరపేట సమీపంలోని సూరయ్యాపేట వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ నగర్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ కాలనీలో వేగేశ్వరపురం, తాళ్లపూడి, అన్నదేవరపేట, ప్రక్కిలంక, తాడిపూడి గ్రామాల ప్రజలకు స్థలాలు కేటాయించినట్టు తెలిపారు. యాభై శాతం లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నారని, వారికి విడతల వారీగా బిల్లులు కూడా చెల్లిస్తున్నట్టు వివరించారు. మిగతా లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రావాలని కోరారు. ఈయన వెంట ఏఈ సుబ్బరాజు ఉన్నారు.

జగనన్న కోసం సైనికుల్లా పని చేయండి

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- చంద్రబాబు మాటలు నమ్మొద్దు : పార్లమెంటరీ కోఆర్డినేటర్ గూడూరి
- గోపాలపురం మండలంలో పర్యటన



హుకుంపేటలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

గోపాలపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోసం వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని, 175 నియోజకవర్గాలు గెలవాలన్న సంకల్పాన్ని నెరవేర్చాలని రాష్ట్ర హోం, విపత్తుల శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత పిలుపునిచ్చారు. మండలంలోని హుకుంపేట, గోపవరం, రాజంపాలెం, దొండపూడి గ్రామాల్లో గురువారం మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తట్టుకోలేక జనసేన, బీజేపీలతో కలిసి ఈమధ్య వచ్చిన షర్మిలమ్మతో కూడా కూటమి ఏర్పాటు చేసుకోవడానికి టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. ప్రతిఒక్కరూ ఐక్యత, క్రమశిక్షణతో వైఎస్సార్ సీపీని 2024లో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో జగనన్న దేశ చరిత్రలో సుస్థిర స్థానంలో నిలిచిపోయారని పేర్కొన్నారు. ప్రజలు తమ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాను గుర్తుపై వేసి, జగనన్నకు అండగా నిలవాలని ఆమె పిలుపునిచ్చారు.

చంద్రబాబును నిలదీయండి: గూడూరి శ్రీనివాస్

అమలు కాని హామీలిచ్చి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని రాజమహేంద్రవరం పార్లమెంటరీ పార్టీ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రానికి కేటాయించిన నిధులు స్వలాభానికి వాడుకుని, అభివృద్ధిని గాలికొదిలేసిన చంద్రబాబు, ఇప్పుడు అమలు కాని హామీలతో ప్రజల వద్దకు వస్తారని, వారి మాటలు నమ్మొద్దని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంట్ స్థానాలను గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని కోరారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, నాయకులు ఎస్‌కే ఖాదర్‌వలీ, వెలగా శ్రీరామమూర్తి, జమీందారులు హోతా రాంపండు, విశ్వేశ్వరరావు, మండల అధ్యక్షుడు పోతిరెడ్డి నాగరాజు, మహిళా అధ్యక్షురాలు యండపల్లి కవిత, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఆచంట అనసూయ, శాప్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, సర్పంచ్‌లు యండపల్లి శేఖర్‌బాబు, కురుకూరి ధనలక్ష్మి, మల్లిపూడి అచ్చిబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గోశాలలో హోం మంత్రి ప్రత్యేక పూజలు



రాంపాలెం గోశాలలో గోవులకు దాణా తినిపిస్తున్న మంత్రి వనిత

గోపాలపురం: రాంపాలెంలోని గోశాలలో రాష్ట్ర హోం, విపత్తులు శాఖా మంత్రి డాక్టర్ తానేటి వనిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం రాంపాలెంలోని ఆంజనేయస్వామి, దుర్గాదేవి ఆలయాలను సందర్శించారు. అనంతరం గోశాలలో గోవులకు అరటిపండ్లు, శనగలను తినిపించారు. అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఆమె వెంట ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, హోతా శ్రీరామచంద్రమూర్తి, విశ్వేశ్వరరావు, పార్టీ నాయకులు ఉన్నారు.

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్



గోపాలపురంలో స్ట్రాంగ్ రూమును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మాధవీలత, ఆర్డీ శివజ్యోతి

గోపాలపురం: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారిణి కె.మాధవీలత అన్నారు. గోపాలపురం బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను గురువారం ఆమె పరిశీలించారు. నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కె.శివజ్యోతితో కలసి పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్ర వివరాలు, బీఎల్‌ఓ పేరు, ఫోన్ నంబరు, పోలింగ్ కేంద్రం గోడకు అతికించాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్ల వారీగా వివరాలు, ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ ఎస్ కృష్ణ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

మహిళా క్రికెట్ రన్నర్లకు ట్రోఫీ అందజేత



మహిళా క్రికెట్ రన్నర్లకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో తూర్పుగోదావరి జిల్లా జట్టుతో ఆడి, రన్నర్లుగా నిలిచిన దేవరపల్లి గ్రామ సచివాలయం-1 జట్టుకు బుధవారం రాత్రి దేవరపల్లిలో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖా మంత్రి తానేటి వనిత ట్రోఫీ అందజేశారు. రాష్ట్ర స్థాయిలో పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన క్రీడాకారిణులు సీహెచ్ కవిత, పి.శ్రీలేఖ, టి.ఉమాదేవి, ఇ.తేజస్వీ, టీవీ సౌజన్య, ఓరుగంటి హేమలత, ఎస్.మంజుల, ఎస్ఎల్ ప్రసన్న, యు.రమ్యశ్రీ, జి.హేమమాధురి, టి.చిన్నబుజ్జి, కె.జాహ్నవి, కె.తేజశ్రీ, యు.సంధ్యను జట్టు కెప్టెన్ కవిత, సచివాలయ కార్యదర్శి ఎన్.రవికిషోర్‌ను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్, ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ, మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, మండల సేవాదళ్ చైర్మన్ మాధవరపు వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు కవల శ్రీనివాస్, ఉప సర్పంచ్ వెలగా సాంబశివరావు, ఎంపీటీసీ సభ్యులు పల్లికొండ రామలక్ష్మి, కామిశెట్టి శిరోమణి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు కడిమి రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

వేలివెన్ను గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు



వేలివెన్నులో మహిళకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. వేలివెన్ను గ్రామంలో జెడ్పీటీసీ నందిగం భాస్కరరామయ్య ఆధ్వర్యంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారు పొందిన పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి గ్రామానికి మేలు జరిగిందని, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందుతున్నాయన్నారు. నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించామని, మౌలిక సదుపాయాలు మెరుగుపరిచామన్నారు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, హెల్త్ వెల్నెస్ సెంటర్లకు భవనాలు నిర్మించామని చెప్పారు. జగనన్న లేఅవుట్లలో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఎంపీటీసీ మల్లిపూడి పాప, సొసైటీ అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణబ్రహ్మానందం, శిరిగిన శివరాధాకృష్ణ, ముళ్లపూడి కేశవరావు, కంజులూరి శ్రీనివాసు, షేక్ మస్తాన్, మద్దూరి సత్యనారాయణ, ముళ్లపూడి కృష్ణారావు, చదలవాడ హరీష్, పి.పార్వతి, చిట్టూరి జగదీష్ చౌదరి, చిట్టూరి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

దివ్యాంగ ఓటర్ల కోసం ర్యాంప్ నిర్మించాలి



తాడిపర్రు ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

ఉండ్రాజవరం: ఎన్నికల సందర్భంగా దివ్యాంగ ఓటర్ల కోసం తప్పనిసరిగా ర్యాంప్ ఉండాలని తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ అన్నారు. తాడిపర్రు ఉన్నత పాఠశాలతో పాటు, పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలతో పాటు, ర్యాంపుల నిర్మాణాన్ని పరిశీలించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈఓపీఆర్డీ ప్రసాద్, వీఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెరవలి: పెరవలి, కానూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ కోసం విద్యుత్ సరఫరాను శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలిపివేస్తారని ఏపీఈపీడీసీఎల్ డీఈ బి.వీరభద్రరావు తెలిపారు. మండలంలోని 18 గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాను ఉదయం 5 నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఆరు గంటల వరకు నిలిపివేస్తారని చెప్పారు.

చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి చేశాం

- ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు
- సింగవరం, అట్లపాడుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అట్లపాడులో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, ప్రజాప్రతినిధులు

నిడదవోలు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో చరిత్రలో నిలిచిపోయేలా నిడదవోలు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. సింగవరంలో రూ.57 లక్షలు, అట్లపాడులో రూ.32.50 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రెయిన్లకు ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కోవిడ్ విపత్కర పరిస్థితులు తలెత్తినా, ఎక్కడా సంక్షేమ పథకాలు ఆగలేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం .. సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మళ్లీ సంక్షేమ పాలనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సర్పంచ్ పెన్మెత్స వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు పెన్మెత్స నిర్మల, కోపల్లి అనంతలక్ష్మి సత్యవతి, సొసైటీ అధ్యక్షులు పెన్మెత్స చందు, యాళ్ల రామారావు, పార్టీ గ్రామ అధ్యక్షులు తమ్మారావు, ముదునూరి జగదీష్‌వర్మ, సచివాలయ కన్వీనర్ కొయ్యే నరేష్‌బాబు, తిరుమళ్ల మునేశ్వరరావు, రేపల్లి సత్యనారాయణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

భగవంతుడి సేవే మహాభాగ్యం

పెరవలి: భగవంతుని సేవ చేయటమే మహాభాగ్యమని, విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని అమ్మవారికి సేవ చేయటం పూర్వజన్మ సుకృతమని ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు పేర్కొన్నారు. కాకరపర్రులో దానమ్మ అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ గురువారం జరిగింది. ఈ గ్రామం ఆధ్యాత్మికతతో పాటు, ఎందరో కవులు పుట్టిన గ్రామమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షులు వీరమళ్ల సత్యనారాయణ, సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి శ్రీనివాస్, ఉప సర్పంచ్ చెర్ల శ్రీరామచంద్రమూర్తి, నామన ఆంజనేయులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పిట్టల వేమవరంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పేదలకు మెరుగైన వైద్య సేవలు

పెరవలి: ప్రతి పేదవాడికి వైద్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు అన్నారు. పిట్టల వేమవరం గ్రామంలో రూ.23.60 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ క్లినిక్‌తో గ్రామాల్లో నిత్యం పేదలకు వైద్యం అందుతుందని చెప్పారు. కార్పొరేట్ స్థాయి వైద్యం కోసం ఆరోగ్య సురక్షా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో రూ.25 లక్షలకు ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచారని చెప్పారు. ఐదేళ్లలో నియోజక వర్గాన్ని అవినీతి రహితంగా, అభివృద్ధి పథంలో నడిపించానని, మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ నేత వీరమళ్ల సత్యనారాయణ, సర్పంచ్ మండా హైమావతి, చిన్న, ఎంపీటీసీ రుద్రరాజు వజ్రపావని, సొసైటీ అధ్యక్షులు మండ తాతారెడ్డి, పార్టీ నాయకులు కొవ్వూరు సర్వోత్తమరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ ప్రతిష్ఠ

నిడదవోలు రూరల్: కలవచర్ల గ్రామంలో అభయాంజనేయస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో బోనేపల్లి సుబ్బారావు, ఉమాదేవి దంపతులు హోమాలు, పూజా కార్యక్రమాలు జరిపారు. భారీ అన్న సమారాధన జరిగింది. మాజీ ఎంపీపీ మన్యం సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల రంగారావు, యాళ్ల రామారావు పాల్గొన్నారు.

సినిమా ప్రదర్శన నిలుపుదల

నల్లజర్ల: హైకోర్టు ఉత్తర్వుల మేరకు రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనను రెవెన్యూ అధికారులు నిలుపుదల చేశారు. నల్లజర్లలోని లక్ష్మీ మల్టీప్లెక్స్‌లో గురువారం ఉదయం ఈ సినిమా ప్రదర్శనను నిలిపివేసి, చిత్రాన్ని ప్రదర్శించవద్దని నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో టీడీపీ కార్యకర్తలు రెవెన్యూ, పోలీస్ అధికారులతో వాగ్వాదానికి దిగారు.

కొవ్వూరు: పట్టణంలోని యువరాజ్ థియేటర్‌లోను సినిమా ప్రదర్శనను పోలీసులు అడ్డుకున్నారు. టీడీపీ నాయకులు కొద్దిసేపు హల్‌చల్ చేశారు. కోర్టు ఉత్తర్వుల మేరకు సినిమా ప్రదర్శన నిలిపివేసిన విషయాన్ని పోలీసుల నుంచి తెలుసుకుని వారు వెనుతిరిగారు.

మేలైన యాజమాన్య పద్ధతులే కీలకం

కేంద్రీయ దుంప పంటల పరిశోధన స్థానం డైరెక్టర్ జి.బైజు



తొగుమ్మి గ్రామంలో కంద విత్తన దుంపలను పరిశీలిస్తున్న జి.బైజు, శాస్త్రవేత్తల బృందం

కొవ్వూరు: కంద పంటలో అధిక దిగుబడులు సాధించడానికి మేలైన యాజమాన్య పద్ధతులతో పాటు, నాణ్యమైన విత్తనాల ఎంపికపై రైతులు శ్రద్ధ వహించాల్సి ఉంటుందని కేంద్రీయ దుంపపంటల పరిశోధన కేంద్రం తిరువనంతపురం డైరెక్టర్ డాక్టర్ జి.బైజు అన్నారు. గురువారం కొవ్వూరులోని వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానాన్ని ఆయనతో పాటు శాస్త్రవేత్తలు డాక్టర్ నెడుంచెరియన్, దాడి జగన్నాథన్ సందర్శించారు. తొగుమ్మిలో రైతులు సాగు చేస్తున్న కంద పంటను బృందం సభ్యులు పరిశీలించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకుని, మంచి దిగుబడులు సాధించాలంటే కందలో విత్తన దుంపల ఎంపిక, ఎరువుల సమతుల్య వాడకం, చీడపీడల యాజమాన్యం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విత్తన దుంపలను ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకునే సమయంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. పంట మార్పిడి విధానం, అంతర పంట సాగుపై కూడా రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యాన పరిశోధన స్థానంలో వివిధ రకాల దుంప పంట రకాలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త జి.రామనందం, శాస్త్రవేత్తలు డాక్టర్ కె.మమత, కె.రవీంద్రకుమార్, డాక్టర్ సీహెచ్ కిషోర్‌కుమార్, డాక్టర్ ఎ.స్నేహలతా రాణి, డాక్టర్ ఎం.విశ్వనాథ్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



మల్లవరంలో కానిస్టేబుల్ శ్రీనేష్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

చాగల్లు: మల్లవరం గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ జలాది శ్రీనేష్ కుమార్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందాడు. గురువారం మల్లవరంలో శ్రీనేష్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు పరామర్శించారు. అతని చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తొలుత దారవరంలో రాయుడు వెంకటేష్ కుమార్తె ఓణీల వేడుకలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు లకంసాని సూర్యప్రకాశరావు, వుండవల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

నిడదవోలు రూరల్: ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ గురువారం తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం నందమూరుకు చెందిన గంజి వెంకటేశ్వరరావు, సింగులూరి వెంకన్న రెండు రోజుల క్రితం బైక్‌పై నిడదవోలు మండలం కోరుమామిడికి వెళ్తుండగా, తాడిమళ్ల వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. తీవ్ర గాయాలైన వెంకటేశ్వరరావు, వెంకన్నను రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎముకల సాంద్రత నిర్ధారణ పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, కేఎస్ఆర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎముకల సాంద్రత నిర్ధారణ పరీక్షలకు ప్రజలు విశేషంగా తరలివచ్చారని కేఎస్ఆర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కొమ్మ ఉజ్వల్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బూరగడ్డ మురళీ, కోశాధికారి పి.కృష్ణ ప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక కంభం సత్రం సమీపంలోని కేఎస్ఆర్ ఆసుపత్రిలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిర్వహించిన ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కొమ్మ సుస్మిత రోగులను పరీక్షించారు. ఆమె మాట్లాడుతూ విటమిన్ డి లోపం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మొలకెత్తిన గింజలు, ఆకు కూరలు, పాలు, పండ్లను ఎక్కువగా తీసుకోవాలని, ప్రతి రోజూ కనీసం 15 నిమిషాలు సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలని సూచించారు. సుమారు 200 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ డాక్టర్ కొమ్మా శ్రీనివాసరావు, మానవత సేవాసంస్థ సభ్యులు మంగరాజు, కేఎస్ఎన్ మూర్తి, శ్రీరామమూర్తి, రాజ్యలక్ష్మి, రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

నిడదవోలు: పట్టణంలోని చర్ల సుశీల వృద్ధాశ్రమంలో గురువారం డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. గతంలో కార్డులు పొందలేని వృద్ధులకు స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ కొత్తపల్లి సుప్రియ, వలంటీర్లు, వైద్య సిబ్బందితో కలిసి 26 మందికి అందజేశారు.

సమ్మె కాలానికి జీతాలు చెల్లించాలి

కొవ్వూరు: ఇటీవల నిర్వహించిన సమ్మె కాలానికి అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులతో పాటు, కోవిడ్, వరదలు, కొత్తగా చేరిన డ్రైవర్లు, ఎన్ఎంఆర్‌లకు జీతాలు చెల్లించాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్, సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు.

సమ్మెను విజయవంతం చేయండి

కొవ్వూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు కోరారు. పట్టణంలో గురువారం సమ్మెకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

ప్రభుత్వ ఉద్యోగుల నిరసన

నిడదవోలు : ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాలూకా జేఏసీ చైర్మన్ కె.నందీశ్వరుడు, రాంబాబు, జయంత్ తదితరులు పాల్గొన్నారు.